వేగ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ

● హైవే భద్రతా మాసోత్సవాల ముగింపులో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 31 : యువత అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రమాదాల నివారణకు వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపులో భాగంగా మేడ్చల్ రవాణాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్, ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో శుక్రవారం పేట్ బషీరాబాద్ రవాణా శాఖా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించినప్పుడే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటామన్నారు.

పేట్ బషీరాబాద్ ఆర్‌టీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వివేకానంద్,వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత తదితరులు

నిబంధనలు అతిక్రమించి రోడ్డుపై ఇష్టానుసారంగా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. వాహనదారులంతా ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రవాణాశాఖాధికారి రఘునాథ్ నాయక్, అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగరాజు, ఎంవీఐలు సాధుల శ్రీనివాస్, రవిందర్‌రెడ్డి, శ్రీనుబాబు, శిల్ప, ఉమా, శ్రీకాంత్‌రెడ్డి, సైక్లిస్ట్ రవీందర్, బైక్ రైడర్స్ పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి సేవలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్ : షాపూర్‌నగర్, గాజులరామారం ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైశ్యకార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీంఖాన్, వెంకటేశ్, చిన్న చౌదరి, చందు, వహీద్, బద్రి, నారాయణ, గౌస్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతులు

దుండిగల్,జనవరి 31: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, సంక్షేమసంఘాల నేతలు, పార్టీ కార్యకర్తలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

అలరించిన సంగీతోత్సవాలు

కొండాపూర్, జనవరి 31 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలుపురి కళాకారుల గాత్ర, వాద్య, నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. గురు స్వప్న కృష్ణమోహన్ శిష్య బృందం నౌకా చరిత్రం కూచిపూడి నృత్యరూపకంలో ఆకట్టుకోగా, విద్వాన్ సీవీపీ శాస్త్రి త్యాగరాజ కృతులని ఆలపించారు.

నేడు అల్లాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

అల్లాపూర్, జనవరి 31 : అల్లాపూర్ డివిజన్‌లోని హిందూ,ముస్లిం శ్మశాన వాటికలను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగం కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం సందర్శించనున్నారు. సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సబీహాబేగం పేర్కొన్నారు.

శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు కృషి

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట, జనవరి 31: మూసాపేట డివిజన్ శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. డివిజన్ పరిధి పాండురంగానగర్ శ్మశానవాటికను శుక్రవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్మశానవాటికలో బెంచీలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్ రూమ్‌కు రేకులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బీఎస్పీ కాలనీలోని పార్కును సందర్శించారు. కాలనీలు, బస్తీల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జలమండలి డీఈ స్రవంతి, ఏఈ వైశాలి, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, చక్రపాణి, ఉదయ్, రాజ్‌కుమార్, శ్రీను, జోసెఫ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'రామాయణ కల్పవృక్షం'

జ్యోతి వెలిగిస్తున్న ప్రముఖ నర్తకి డాక్టర్ ఆనంద శంకర్ జయంత్

మాదాపూర్,జనవరి 31: రామాయణ కల్పవృక్షం మన జీవితంలోకి శ్రీ రాముడి చైతన్యాన్ని తిరిగి తీసుకువస్తుందని ప్రముఖ నర్తకి, డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ అన్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్‌టీలో శుక్రవారం ఏర్పాటు చేసిన రామాయణ కల్పవృక్షం కార్యక్రమంలో ఆనంద్ శంకర్ జయంత్ పాల్గొని మాట్లాడారు. మూడు రోజులపాటు రాముడి పాత్రను నృత్యం, సంగీతం, హరికథ తదితర ప్రదర్శనల ద్వారా పరిచయం చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం నిర్వహించిన రామరస కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో సంగీత ప్రముఖులు రంజని, గాయత్రి, నిరిక్షిత సంగీత కృతి రామా బై రాగ ప్రదర్శన, హరికథ కళా నిపుణురాలు విశాఖ హరి వారి రామాయణం, ది లైఫ్ గివింగ్ ట్రీ, రుక్మిణీదేవి అరుండలే రూపొందించిన ప్రముఖ నృత్య రూపకం శబరి మోక్షం, కలాక్షేత్ర ఫౌండేషన్ ద్వారా ప్రదర్శన, మణిపూర్‌లోని జేఎన్ మణిపురి డ్యాన్స్ అకాడమీ వారు మణిపురి రాస్, పుంగ్, ఢోల్ చోలామ్ వంటి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. శంకరానంద కళాక్షేత్రం సమూహం తక్కువేమి మనకు వంటి ఆరాధనతో ఆహుతులను ఆద్యంతం అలరించారు. యశోదీప్ దియోధర్, ప్రాచుర్యం పొందిన 21 నోట్స్ సృష్టికర్త, రామాయణంపై విస్తృత పరిశీలన ఆహుతులతో పంచుకున్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ల తీరు సరికాదు..


జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్ బయట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవర్తించిన తీరు సరికాదని కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలను ప్రశ్నించిన కార్పొరేటర్లను బహిష్కరించడం, మహిళా కార్పొరేటర్ల పట్ల కాంగ్రెస్ కార్పొరేటర్ల తీరు బాధాకరమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేవరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. కూకట్‌పల్లిలో 24 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకోవడంపై శుక్రవారం ఆయన స్పందించారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతుండటం బాధాకరమన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న యువకులు స్నేహితులతో కలిసి దురలవాట్లకు దగ్గర అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని సమాజంలో గొప్పగా జీవించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : వసంతనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోకుల్‌ప్లాట్స్, వినాయక పార్కు, వెంకటరమణ కాలనీ, సాయిహిల్స్, ప్రజయ్ మెగాపోలీస్, గోపాల్‌నగర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జేఎన్‌టీయూహెచ్‌లో పరిసరాల శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ వీసీ బాలకృష్ణారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని వైస్ చాన్స్‌లర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వర్సిటీలోని బాలికల వసతిగృహంలో క్లీన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వర్సిటీలోని పరిసరాలు, హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, వివిధ విభాగాల డైరెక్టర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ మక్బూల్‌పాష

మియాపూర్, జనవరి 31 : మియాపూర్ ఆర్‌టీసీ డిపో 2లో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీఎం వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ మక్బూల్ పాష పాల్గొని ప్రసంగించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని డ్రైవర్లకు సూచించారు. విధి నిర్వహణలో మద్యం సేవించవద్దని, నిర్దేశిత వేగంతోనే వాహనాలను నడపాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ డ్రైవర్ల ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది పండరి, ప్రశాంత్, జంగారెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకే అందించాలి

బాచుపల్లి డిప్యూటీ తాసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దుండిగల్,జనవరి 31 : అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్, రెవెన్యూ అధికారులు పథకాల అమలులో పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రజా పాలనలో ప్రకటించిన లిస్టులో అనేక అవకతవకలు జరిగాయన్నారు. నిజంగా ఇండ్లు లేని పేదల పేరు లిస్టులో రాలేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం

మజీద్ ఎ ఆరాఫాత్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన జీడిమెట్ల సీఐ మల్లేశ్

జీడిమెట్ల, జనవరి 31: నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తాయని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ అన్నారు. సుభాష్‌నగర్‌లోని మజీద్ ఎ ఆరాఫాత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ మల్లేశ్, ఎస్ఐ సత్య నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అమీర్‌ఖాన్, షేక్ కైసర్, సర్వర్, మహమ్మద్ అస్వర్, మోజ్, అశ్వక్‌ఖాన్, ముఫ్తీఅబ్దుల్ రహమాన్, రసూల్, ముస్లీం పెద్దలు, సుభాష్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

జీడిమెట్ల, జనవరి 31 : రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని డీసీఎం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్ అల్వాల్, కుమ్మరి బస్తీకి చెందిన శంకర్ గౌడ్(65) జనవరి 26న ఉదయం 10గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. దాంతో కుటుంబసభ్యులు 29న ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీస్ కానిస్టేబుల్ మోహన్ మృతుడి కుమారుడు సంతోష్‌కుమార్‌కి ఫోన్ చేసి శంకర్‌గౌడ్ ఫొటోను సెల్‌కు పంపించాడు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలుసుకున్న కుమారుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు దాటుతుండగా శంకర్‌గౌడ్‌ను అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. అనంతరం డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా శంకర్ గౌడ్ తీవ్ర గాయాలతో పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్సనిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఉదయం 3 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లుగీత సంఘం నూతన కార్యవర్గం

కల్లుగీత సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

జగద్గిరిగుట్ట, జనవరి 31 : జగద్గిరిగుట్ట డివిజన్ కల్లుగీత సహకార సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. కోఆపరేటివ్ సొసైటీ అధికారులు శ్రీకాంత్, హరి పర్యవేక్షణలో అధ్యక్షుడిగా గూడ ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా విఠల్‌గౌడ్, కార్యదర్శిగా సాయిలుగౌడ్, డైరెక్టర్లుగా అంజన్‌గౌడ్, సత్యలక్ష్మిని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్‌నగర్, మఖ్దూంనగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల సభ్యులు పాల్గొన్నారు.

ధీమ్ పార్కు తరహాలో అభివృద్ధికి చర్యలు

అపర్ణ కమ్యూనిటీలో పార్కు అభివృద్ధిపై స్థానికులతో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్, జనవరి 31 : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులను సుందరీకరించనున్నట్లు చందానగర్ సర్కిల్ ఉప కమీషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. పార్కు స్థలాల రక్షణతోపాటు థీమ్ పార్కు తరహాలో ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. చందానగర్ సర్కిల్ అపర్ణ కమ్యూనిటీలో జీహెచ్ఎంసీకి చెందిన పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని డీసీకి కమ్యూనిటీ ఫెడరేషన్ అధ్యక్షురాలు రాణిరెడ్డి, సభ్యులు ఇటీవల కలిసి విన్నవించారు. ఈ మేరకు డీసీ మోహన్‌రెడ్డి వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం అపర్ణ కమ్యూనిటీ పార్కును సందర్శించారు. పార్కులో ఒక వైపు గోడను తొలగించి బారికేడింగ్ వేయడాన్ని గుర్తించారు. విలువైన పార్కు స్థలం ఆక్రమణకు గురి కాకుండా ప్రహరీ పునర్నిర్మాణం చేయాలని, పార్కులోపల చెత్త, ఏపుగా పెరిగిన చెట్ల తొలగింపు సహా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఫెడరేషన్ భాగస్వామ్యంతో పార్కును మరింత సుందరీకరించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ కేవీఎస్ఎన్‌రాజు, డీఈ దుర్గాప్రసాద్, డాక్టర్ రవి, టీపీఎస్ కార్తిక్, యూబీడీ అధికారి సమీర, కమ్యూనిటీ ఫెడరేషన్ అధ్యక్షురాలు రాణిరెడ్డితోపాటు ప్రతినిధులు విక్రమ్, రమేశ్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ నారాయణరెడ్డి, పద్మ, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో గద్దర్ జయంతి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. భారత ప్రభుత్వం గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బొట్ల భిక్షపతి, పవన్‌కుమార్, సుకుమార్, దిలీప్, శివాజీ, సైదా రాజ్‌పుత్, టి.తేజ, ఆర్.తేజ, వేణు, ప్రభాస్, ఉదయ్, ప్రణీత్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమానికి మద్దతు పలకండి

జగద్గిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట, జనవరి 31 : ఎస్సీవర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'వేలగొంతుకలు, లక్షడప్పులు' సభను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. శుక్రవారం జగద్గిరిగుట్టలో సీపీఐ, ప్రజానాట్య మండలి, దళితసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. మాదిగలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు సభకు తరలి రావాలని కోరారు. సమావేశంలో డప్పు రామస్వామి, లాలయ్య, హరినాథ్, రాములు, యాకయ్య, వెంకట్, గణేశ్, సోమన్న మల్లేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి గద్దర్‌పై మాట్లాడే హక్కు లేదు..

పేదల కోసం పోరాడిన ప్రజా యుద్ధనౌక గద్దర్ గురించి మాట్లాడే హక్కు బండి సంజయ్‌కి లేదని సీపీఐ నాయకులు విమర్శించారు. గద్దర్ జయంతి సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవార్డులతో గద్దర్‌ను కొలవలేరన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి ఉమామహేశ్, హరనాథ్, ప్రవీణ్, బాబు, ముసలయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం రీసెర్చ్ మెథడాలజీ తరగతులు నిర్వహించండి..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న రీసెర్చ్ మెథడాలజీ తరగతులను మధ్యాహ్న సమయంలో నిర్వహించాలని రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావుకు శుక్రవారం వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు దిలీప్, భరత్‌కుమార్, రాహుల్‌నాయక్, అనీష్‌కుమార్, సోహన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ దస్త్రాలు సృష్టించి భూమి కాజేసిన వ్యక్తి అరెస్ట్

దుండిగల్, జనవరి 31: నకిలీ దస్తావేజులు సృష్టించి విలువైన భూములను కాజేసిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ-దుండిగల్ మండలం దొమ్మరపోచంపల్లికి చెందిన జానకీదేవికి అదే గ్రామపరిధిలోని సర్వే నంబర్ 315/1లో 2ఎకరాల 17 గుంటల భూమి ఉన్నది. ఆ భూమిని జానకీదేవి సైమన్‌ల్యాబ్ ప్రతినిధి చంద్రప్రకాశ్‌రావుకు గతంలోనే విక్రయించింది. ఆయన మోహన్‌రావు అనే వ్యక్తికి విక్రయించాడు. ఇందులో రెండు ఎకరాలు మాత్రమే మోహన్‌రావు ఆధీనంలో ఉండగా మిగిలిన 17 గుంటల భూమి ఖాళీగా ఉన్నది. ఈ భూమిపై ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్‌కు చెందిన వ్యాపారి ఎంఎల్ అనిల్‌కుమార్ వర్మ(77) దృష్టి పడింది. ఎలాగైనా ఆ స్థలాన్ని కాజేయాలని అతడు జానకీదేవికి సంబంధించిన నకిలీ గుర్తింపుకార్డుతో పాటు ఇతర దస్తావేజులను సృష్టించి బొంగుసూరి మానసకు 17 గుంటల స్థలాన్ని విక్రయించాడు. కొద్ది రోజుల అనంతరం అసలు విషయం తెలియడంతో 2023లో మోహన్‌రావు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా అనిల్‌కుమార్ వర్మ నకిలీదస్తావేజులు సృష్టించి స్థలాన్ని విక్రయించినట్లు తేలింది. శుక్రవారం ఉదయం పోలీసులు అనిల్‌కుమార్‌వర్మను ఖైరతాబాద్‌లో అతడి ఇంట్లో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బీఆర్ఎస్ లేకుండానే బడ్జెట్ ఆమోదించుకున్నారు..

బల్దియా అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

మియాపూర్, జనవరి 31 : జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు కుమ్మక్కై బడ్జెట్‌ను ఆమోదించుకున్నాయని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకే గుండెకాయలాంటి జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ. 8 వేల కోట్లని, అంతటి కీలకమైన అంశాన్ని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ లేకుండా చేసి ఆయా పార్టీలు ఆమోదించటం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మరో మారు కౌన్సిల్ సమావేశం నిర్వహించి బడ్జెట్‌పై చర్చ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు సహచర కార్పొరేటర్లతో కలిసి మాధవరం రోజాదేవి బల్దియా అదనపు కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

బిచ్చమెత్తయినా జీహెచ్ఎంసీని నడిపిస్తామని చెప్పిన బీజేపీ.. ఇంత విలువైన బడ్జెట్‌పై చర్చించకుండా ఆ పార్టీలతో కుమ్మక్కై ఆమోదించటంలో తోడ్పాటునందించటం హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధిలేదని ఆమె పేర్కొన్నారు.

కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా క్రిష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్, జనవరి 31 : కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా క్రిష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ కె.శ్రీహరి పటాన్‌చెరువు హన్సాపూర్ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ కాలనీల్లో ఏలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పదవీ విరమణ సన్మానం

కొండాపూర్, జనవరి 31 : కొ